కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో...) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చి మిర్చి 28, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చ కాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 18, దొండ 40, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 28, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 20, చామగడ్డ 41, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

25న మాదిగ కులాల ఐక్య వేదిక సమావేశం

లక్డీకాపూల్: మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25న బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్ లో నిర్వహించే ముఖ్య సమావేశంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన అన్ని కుల సంఘాలు పాల్గొనాలని ఐక్య వేదిక విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన మాదిగ సామాజిక వర్గ అమరవీరుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు, అమరవీరుల స్థూపం ఏర్పాటులపై చర్చించనున్నట్టు పేర్కొంది.

శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగం విద్యార్థి పాల శ్రీనివాస్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.మురళీకృష్ణ పర్యవేక్షణలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

వాటర్ క్వాలిటీ కమిటీ మెంబర్‌గా ఓయూ ప్రొఫెసర్


ప్రొ.సయ్యద్ అజీమ్ ఉన్నీసా

ఉస్మానియా యూనివర్సిటీ: జాతీయ స్థాయి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) వాటర్ క్వాలిటీ కమిటీ సభ్యురాలిగా ఓయూ ప్రొ.సయ్యద్ అజీమ్ ఉన్నీసా నియమితులయ్యారు. ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో అధ్యాపకురాలుగా పని చేస్తున్న ఆమె బోర్డాఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

24న చలో ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పరీక్ష ఫీజులకు నిరసనగా ఈ నెల 24న చలో ఉస్మానియా యూనివర్సిటీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏబీవీపీ సిటీ సెక్రెటరీ పృథ్వీతేజ శుక్రవారం తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రైవేటు వర్సిటీలను తలపించేలా విధంగా ఓయూ పరిధిలోని అన్ని కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫీజులను ఇష్టానుసారం పెంచారని ధ్వజమెత్తారు.

కేవీకి ఫ్యాన్, ప్రింటర్ విరాళం


పాఠశాలకు వస్తువులను విరాళంగా అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రసూల్‌పురా: కేంద్రీయ విద్యాలయం పికెట్‌లో ఐదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హైస్కూల్ హెచ్ఎం రూపిందర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు సోఫా, ప్రింటర్, టేబుల్ ఫ్యాన్ వంటి అవసరమైన వస్తువులు విరాళంగా అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

సనత్‌నగర్: మాతృశ్రీ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ శ్యామలకుంట బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కన్నూరి క్రాంతికుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి సమాజానికి తమ తోడ్పాటునందించనున్నట్లు చెప్పారు కార్యక్రమంలో సీనియర్ నాయకులు దయానంద్, కన్నూరి చంద్రకుమార్ పాల్గొన్నారు.


చిన్నారులకు కుర్చీలు వితరణ చేసిన దృశ్యం

రూ. 100 కోట్లు లక్ష్యం

- ఇప్పటికి రూ.71 కోట్లు వసూలు
- ఇక మిగిలింది 38 రోజులే..
- మార్చి 29 వరకు ప్రతి శనివారం ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార వేదికలు

పన్ను వసూళ్లపై గ్రేటర్ అధికారుల దృష్టి

సనత్‌నగర్: త్వరలో ఆర్థిక సంవత్సరం ముగియబోతోంది. ఇంకా 40 రోజుల మాత్రమే మిగిలి ఉండగా జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్‌లో ఆస్తి పన్ను వసూళ్ల టార్గెట్ భారీగానే ఉంది. రూ.100 కోట్ల పైచిలుకు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 71 కోట్ల మేర వసూలైంది. ఇంకా దాదాపు 30 శాతం మేర ఆస్తి పన్ను రాబట్టాల్సి ఉంది. గత ఏడాది రూ.98.20 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలు చేసి బేగంపేట సర్కిల్ పన్నుల విభాగం అధికారులు రికార్డు సృష్టించారు. అయితే గత సంవత్సరం ఆస్తి పన్ను బకాయిదారులకు వడ్డీపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీపీ) స్కీం ద్వారా వడ్డీపై 90 శాతం రాయితీ కల్పించడంతో 100 కోట్ల టార్గెట్‌కు చేరువయ్యారు. గత ఏడాది వసూలైన రూ.98.20 కోట్లను దాటే ప్రణాళికతో బేగంపేట సర్కిల్ అధికారులు ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా మొండి బకాయిదారులపై కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఏఈ స్థాయి అధికారులతో పాటు యూబీడీ అధికారులను సైతం నియమించి పన్ను వసూళ్ల పైనే దృష్టి కేంద్రీకరించారు.

- సర్కిల్ వ్యాప్తంగా 18 డాకెట్స్ ద్వారా పన్ను వసూలు చేస్తున్నారు. ఇప్పటికే పలు సర్కిళ్లలో బకాయిదారుల ఆస్తులను సీజ్ చేసే పనిలో పడగా ఆ కోవలోనే బేగంపేట సర్కిల్ అధికారులు చర్యలకు దిగేందుకు సమాయత్తమవుతున్నారు.
- బేగంపేట సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా మార్కెట్ డివిజన్లు ఉన్నాయి. మొండి బకాయిదారులతో పాటు ఎక్కువ శాతం మార్చి నెలలోనే చెల్లిస్తారని అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు టార్గెట్‌ను పూర్తి చేస్తామన్న ధీమాతో అధికారులు ఉన్నారు.


ఆస్తి పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

- 100 కోట్ల లక్ష్యాన్ని చేరువయ్యేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ చెల్లించేందుకు ముందుకు రాకపోతే జీహెచ్ఎంసీ యాక్ట్ కింద రెడ్ వారెంట్ జారీ చేసి ఆస్తులను జప్తు చేసేందుకైనా వెనుకాడబోమన్న ధోరణితో అధికారులు ఉన్నారు. ఆ దిశగా ఇప్పటికే చాలామంది బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు.
- నిర్ణీత గడువు లోగా చెల్లించని పక్షంలో చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే చివరికి వచ్చేసరికి ఎంతోకొంత ఆస్తి పన్ను బకాయిలు మిగిలిపోవడం ప్రతియేటా పరిపాటిగా మారింది. అవి కాస్త మొండి బకాయిలుగా మిగిలిపోతున్నాయి.
- ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా నూటికి నూరు శాతం వసూళ్లే లక్ష్యంగా పెట్టుకుని అధికారులు పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలో తెల్లవారింది మొదలు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు బకాయిదారుల ఇళ్ల ముందు వాలిపోయి పన్నుల వసూళ్లు చేస్తున్నారు.

బేగంపేట సర్కిల్‌లో భవన వివరాలు ఇలా..	
మున్సిపల్ డివిజన్లు:	4
కాలనీలు :	130
నివాస గృహాలు:	47,335
వాణిజ్య భవనాలు:	23,575
నివాస, వాణిజ్య కలిసి ఉన్నవి:	1147

ప్రతి శనివారం ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార వేదిక



జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార (పీటీపీ) వేదిక నిర్వహిస్తున్నాం. ఇందులో పన్ను సమస్యలపై పునః సమీక్షపై అభ్యర్థనల స్వీకరణ, ఆస్తి పన్ను సవరణలు, కోర్టు కేసుల ట్యాక్స్‌లకు సంబంధించి సమస్యలు..ఇలా ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి ఎలాంటి సమస్యలు, సందేహాలు ఉన్నా సర్కిల్ కార్యాలయంలో ప్రతి శనివారం జరిగే పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావచ్చు. ఈ నెల 22 (నేడు), మార్చి 1, 8, 15, 22, 29 తేదీల్లో ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించిన అభ్యర్థనలు స్వీకరించనున్నట్లు వివరించారు.

– డీఎంసీ సమ్మయ్య, బేగంపేట సర్కిల్

ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారాలు చేసుకోవాలి

సనత్‌నగర్: వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా వ్యాపారాలను నిర్వహించుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఫుట్‌పాత్ వ్యాపారులకు తెలిపారు. రాంగోపాల్‌పేట డివిజన్‌లోని అంజలీ థియేటర్, చిత్ర దర్గా పరిసరాలలో ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదల వ్యాపారాలను ట్రాఫిక్ పోలీసులు కొద్ది రోజుల క్రితం తొలగించారు. దీంతో వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో అంజలి థియేటర్, చిత్ర దర్గా పరిసరాలలో తొలగించిన ఫుట్‌పాత్ వ్యాపారులు తిరిగి వ్యాపారాలు చేసుకునేందుకు అధికారులు అనుమతించారు.


తలసానిని సన్మానించిన ఫుట్‌పాత్ వ్యాపారులు

దీంతో ఫుట్‌పాత్ వ్యాపారులు శుక్రవారం రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నేత శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

'గాంధీ'లో ముగిసిన శిక్షణ శిబిరం


గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిరను సన్మానిస్తున్న అకాడమిక్ డీఎంఈ శివరాం ప్రసాద్

గాంధీ ఆస్పత్రి: గాంధీ వైద్య కళాశాలలోని రీజినల్ ట్రైనింగ్ సెంటర్ లో మూడు రోజులు పాటు నిర్వహించిన 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ శిక్షణ' శిబిరం శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా అకాడమిక్ డీఎంఈ డాక్టర్ శివరాం ప్రసాద్ హాజరై సర్టిఫికెట్లను అందజేశారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు బోధన నైపుణ్యాభివృద్ధిలో భాగంగా ఎన్ఎంసి ఆదేశాల మేరకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన గాంధీ రీజనల్ సెంటర్ నిర్వాహకులను ఆయన అభినందించారు. శిబిరంలో గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే ఇందిరా, అదనపు డీఎంఈ, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కేటగిరి–2 పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025 నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం పాలనా భవనంలో వీసీ ప్రొ.కుమార్‌తో సమావేశమైన విద్యార్థి నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ల వయోపరిమితి 65 ఏళ్లకు పెంచినందున పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెంచాలన్నారు. రిటైర్ ప్రొఫెసర్లకు రీసెర్చ్ సెంటర్ల సైంటిస్టులకు, అర్హత గల డిగ్రీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇచ్చి పీహెచ్‌డీ సీట్ల పెంపుతో రీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పూసల రమేష్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.


వీసీతో విద్యార్థి నేతల సమావేశం

ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌ను పునరుద్ధరిస్తాం


తార్నాక ఎర్రకుంట చెరువు భూములను పరిశీలిస్తున్న అధికారులు

లాలాపేట: తార్నాక ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిరక్షణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని మారెడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి తార్నాక ఎర్రకుంట చెరువును సందర్శించారు. తూము, చెరువు భూములను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ వాటర్ బాడి చెరువు నిర్మాణంపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీలైనంత తొందరగా అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేసి ఎర్రకుంట చెరువును పునరుద్ధరిస్తామన్నారు. చెరువు భూముల్లో ఎలాంటి అక్రమణలు చేపట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ శుక్లజా, ఏఈ సతీష్, అశోక్ తదితరులున్నారు. ఇదిలా ఉండగా ఎర్రకుంట చెరువు భూముల్లో గత కొంత కాలంగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు కొమ్మగళ్ల వెంకటేష్, మధు తదితరులు అధికారులను ప్రశ్నించారు. చెరువు భూమిలోనే బిల్డర్ ప్లాట్స్ బుకింగ్ పేరుతో ఓ హోర్డింగ్‌ను సైతం ఏర్పాటు చేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి



లాలాపేట: రంజాన్ పర్వదిన మాసం నేపథ్యంలో మజీద్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలనీ కోరుతూ శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిని పలువురు ముస్లిం నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తార్నాక డివిజన్ పరిధిలోని మజీద్‌ల వివరాలను ఆ వినతి పత్రంలో పొందుపరిచారు. మజీద్‌ల వద్ద ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగు నీరు, లైట్లు, పరిశుభ్రత శానిటేషన్ తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్మారెడ్డికి తలసాని పరామర్శ

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. లక్ష్మారెడ్డి భార్య సుశీల ఇటీవల మరణించారు. పద్మారావునగర్ ఈశ్వరమ్మ గల్లీలోని లక్ష్మారెడ్డి నివాసానికి వచ్చి సుశీల చిత్రపటానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పూల మాలలేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్ రాజు, బాలరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

రేపు తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ మహాసభలు

కాచిగూడ: తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 5వ మహాసభలను ఈ నెల 23న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నకిరకంటి శ్రీనివాస్ గౌడ్, అడ్వైజర్ చామకూర రాజు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 40,500 మంది గ్యాస్ డెలివరీ వర్కర్స్ ఉన్నారని, వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

పవర్ బోర్ వాటర్ ట్యాంకుల పరిశీలన


అడ్డగుట్ట: పని చేయని పవర్ బోర్ వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకువస్తామని మారేడుపల్లి వాటర్ వర్క్స్ టెక్నికల్ విభాగం మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల అడ్డగుట్ట బీజేపీ నాయకులు జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను కలిసి పవర్‌బోర్ల మరమ్మతులు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అడ్డగుట్ట, తుకారాంగేట్, సాయినగర్, గడ్డమీది బస్తీల తదితర ప్రాంతాల్లోని పవర్‌బోర్ వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు.


తుకారాంగేట్‌లో వాటర్ ట్యాంక్‌లను పరిశీలిస్తున్న జలమండలి సిబ్బంది

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బౌద్ధనగర్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా షెడ్డును నిర్మించగా జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. వారాసీగూడలోని ప్రధాన రహదారిని అనుకుని నాలాపై ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొంత మంది స్థలం చుట్టూ రేకులను ఉంచి కబ్జా చేశారు. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం సాయంత్రం దాన్ని పరిశీలించి ఆక్రమణలను కూల్చివేశారు.

దుస్తుల వ్యాపారి రామేశ్వర్ బంగ్ మృతి



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ పాట్ మార్కెట్ ప్రాంతానికి చెందిన ప్రముఖ దుస్తుల వ్యాపారి రామేశ్వర్ లాల్ బంగ్(69) మరణించారు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలం నుంచి తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామేశ్వర్ బంగ్ గురువారం రాత్రి కన్నుమూశారు. రామేశ్వర్ అంత్యక్రియలు శుక్రవారం కవాడిగూడ శ్మశానవాటికలో నిర్వహించారు. ఎమ్మెల్యే టి. పద్మారావు గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్

అడ్డగుట్ట: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ సూచించారు. శుక్రవారం తుకారాంగేట్‌లోని షిరిడి సాయి బాబా హైస్కూలులో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు తమవంతు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు కూడా పోలీసులు అందించే సూచనలు, జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దయాకర్, స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ సిబ్బందిపై దాడి

అడ్డగుట్ట: తిన్న బిర్యానీకి డబ్బులు అడిగాడని హోటల్ సిబ్బందిపై ఓ వ్యక్తి దాడిచేసి పరారయ్యాడు. లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘు బాబు తెలిపిన మేరకు.. నార్త్‌లాలాగూడ ప్రాంతానికి చెందిన సలీమ్(35) జావీద్(28) ఈ నెల 20న రాత్రి లాలాగూడలోని సూపర్ స్టార్ హోటల్‌లో బిర్యానీ తిన్నారు. తిన్న తరువాత డబ్బులు ఇవ్వకుండా బయటకు వెళ్లిపోతున్నారు. హోటల్ సిబ్బంది డబ్బు అడగ్గా వాళ్లు ససేమిరా అంటూ వాగ్వాదానికి దిగారు. సలీమ్ పక్కనే ఉన్న ఐరన్ రాడ్‌తో హోటల్ కౌంటర్‌లో నిస్సార్ అనే వ్యక్తి తలపై కొట్టాడు. హోటల్ సిబ్బంది గుమిగూడేలోపు సలీమ్, జావీద్‌లు పరారయ్యారు. వెంటనే స్థానికులు నిస్సార్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న లాలాగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. బాధితుడి తలకు నాలుగు కుట్లు పడినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్..

రైలులో నుంచి జారిపడి వ్యక్తి మృతి




అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... మౌలాలి రైల్వే స్టేషన్ 'బి' కేబిన్ అప్‌లైన్ పట్టాల వద్ద శుక్రవారం సాయంత్రం సుమారు 45–50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైలులో నుంచి జారి పడ్డాడు. ఈ క్రమంలో రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

అమీర్‌పేట: ప్రేమించిన వ్యక్తి మరో యువతితో పెళ్లికి సిద్ధం కావడంతో మనస్థాపం చెంది ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది.ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు.. ఎర్రమంజిల్‌కు చెందిన రాజు (28) స్థానికంగా ఉండే 30 ఏళ్ల యువతి గత రెండు సంవత్సరాలుగా ఒకరికొకరు ప్రేమించుకున్నారు. కాగా రాజు తల్లి దండ్రులు ఇటీవల వేరే యువతితో పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో రాజు ప్రేమించిన యువతికి దూరంగా ఉంటూ వస్తున్నాడు. దీంతో మనస్థాపంతో తాను పనిచేస్తున్న అమీర్‌పేటలోని మిలీనియం డెంటల్ ఆసుపత్రిలో బాత్‌రూమ్‌లో ఉన్న హార్పిక్ తాగింది. అస్వస్థతకు గురికావడంతో సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చిలకలగూడ: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. గాంధీ అవుట్ పేషెంట్ విభాగం వద్ద అపస్మారకస్థితిలో పడిఉన్న వ్యక్తిని శుక్రవారం ఉదయం గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది అత్యవసర విభాగానికి తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామన్నారు.

రోడ్ల గురించి పట్టించుకోరా?

బౌద్ధనగర్ డివిజన్‌లో అంతర్గత రహదారులు అధ్వానం

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లో అంతర్గత రహదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. గోతుల మయమైన రోడ్ల కారణంగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలు పక్కన పెడితే కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

- కనకదుర్గ దేవాలయం వెనుక వైపు, కౌసర్ మసీదు, అంబర్‌నగర్, ఏకశిల, తదితర ప్రాంతాల్లోని రోడ్లన్నీ గోతులమయంగా మారాయి.
- సంజీవపురం, రాఘవగార్డెన్ వెనుక వైపు రోడ్డు గుంతలమయమయ్యాయి.
- బౌద్ధనగర్‌లోని అశోక్ సేవా సంఘం ప్రాంతంలోనూ రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంది. అపోలో స్కూల్ ప్రధాన రహదారితో పాటు మరికొన్ని రోడ్లు ఇలాగే ఉన్నాయి.
- గతంలో కురిసిన వర్షాలకు ఈ రోడ్లు దెబ్బతిన్నాయి. వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు అప్పుడప్పుడూ ప్యాచ్‌వర్కుల పేరుతో హడావిడి చేస్తున్నా అది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. అధికారులు స్పందించి రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.


కనకదుర్గ ఆలయం వెనుకవైపు రోడ్డు ఇలా..

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

పంజగుట్ట: బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని విద్యా పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు, భగత్‌సింగ్ మేనల్లుడు జగ్‌మోహన్ సింగ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెరుగైన విద్య అందరికీ అందాలంటే బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కువ ఉండాలని కానీ కేంద్రం నామమాత్రంగా కేటాయింపులు చేసిందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. గతేడాది రుణమాఫీ చేశామని చెప్పి విద్యారంగానికి కేవలం 7.3 మాత్రమే కేటాయించారని, ఈసారైనా బడ్జెట్‌లో 20 శాతం విద్యకు కేటాయించాలని కోరారు. ప్రొఫెసర్లు కె.చక్రధర్ రావు, కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అందరికీ సమాన, మెరుగైన విద్యను అందించాలని కోరారు. సమావేశంలో రవిచంద్ర, గంగాధర్, ప్రదీప్, కిష్టప్ప, లింగారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.